దశ తిరిగింది..!

- అభివృద్ధి పథంలో 51వ వార్డు
- చకచకా రోడ్లు, కాలువల నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించిన రహదారి


పూర్తయిన భీంనగర్-మహత్ కాలనీ రోడ్డు


అప్పయ్యనగర్‌లో జరుగుతున్న కాలువ పనులు

మద్రిపాలెం: జీవీఎంసీ వార్డుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతోంది. అనేక అభివృద్ధి పనులతో 51వ వార్డు దశ తిరగడమే ఇందుకు నిదర్శనం. ఇక్కడి మాధవధారలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. వార్డులో పలు అభివృద్ధి పనులకు కొద్ది రోజుల కిందట నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి శంకుస్థాపనలు చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా గాంధీనగర్‌లో రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. మహత్ కాలనీ, భీంనగర్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. కాలనీలోని పలు ప్రాంతాల్లో రూ.33 లక్షలతో బీటీరోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రూ.11 లక్షలతో హైవే పక్కనే ఉన్న అప్పయ్యనగర్ శ్రీ,భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కనున్న కాలువ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. జీవీఎంసీ ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. గోతుల రోడ్ల స్థానంలో కొత్త బీటీ రోడ్లు సిద్ధం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రయాణాలు సాఫీగా సాగుతాయని వాహన చోదకులు భావిస్తున్నారు.

అందుబాటులోకి సదుపాయాలు

కొత్త కాలువల నిర్మాణం, పునర్నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. దీంతో మురుగు నీటి ప్రవాహానికి ఏమాత్రం ఆటంకం కలగదని ఇంజినీర్లు చెబుతున్నారు. జీవీఎంసీ గత రెండేళ్ల కాల వ్యవధిలో 51వ వార్డులోని పలు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసింది. వార్డులోని గాంధీనగర్ 1, 2, మహత్ కాలనీ, భీంనగర్, అప్పయ్యనగర్ తదితర ప్రాంతాల్లో కొత్త రోడ్లు, వీధిలైట్లు, బోర్లు అందుబాటులోకి రావడంతో స్మార్ట్ సిటీ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని స్థానికులు పేర్కొంటున్నారు. పారిశుధ్యం కూడా మెరుగైన రీతిలో ఉండటంతో రోడ్లు, వీధులు అందంగా మెరిసిపోతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు బాగున్నాయి

మా వార్డులో అభివృద్ధి పనులు బాగా చేస్తున్నారు. డబుల్ లేయర్ రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు ఇబ్బందులు తొలిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి బాగా కనిపిస్తోంది.

– వెంకటసాగర్, భీంనగర్

రోడ్డు నిర్మాణంతో ఆనందం

గాంధీనగర్‌లో రోడ్డు నిర్మించడం ఆనందంగా ఉంది. నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు గతుకుల రోడ్డు మీద ప్రయాణించే వాళ్లం. రోడ్లన్నీ అభివృద్ధి చేశారు. వీధిలైట్లు వేసి అంధకారాన్ని తొలగించారు.

– గణేష్, గాంధీనగర్

వార్డు అభివృద్ధే లక్ష్యం



ప్రజా సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారు. వార్డు అభివృద్ధికి సంబంధించి రూ.11 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అందులో రూ.5 కోట్ల పైనే పనులు జరిగాయి. మిగతావి త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్, 51వ వార్డు

గెడ్డ ఆధునికీకరణకు శంకుస్థాపన


తాటిచెట్లపాలెంలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ శశికళ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో గెడ్డ ఆధునికీకరణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, శంకుస్థాపన చేశారు. సుమారు రూ.37 లక్షల జీవీఎంసీ నిధులతో తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్ నుంచి విశ్వతేజ స్కూల్ రోడ్ వరకు గల గెడ్డకిరువైపులా రక్షణ గోడలు, ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, పార్టీ వార్డు అధ్యక్షులు కేపీ రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, ఉత్తర బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్, పార్టీ నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆళ్ల గోపి, ఎండీ గౌస్, జామి దాసు, సంతోష్, వెంకటేష్, కరుణ, వరలక్ష్మి, ధర్మేంద్రరెడ్డి, నాగలక్ష్మి, జీవీఎంసీ ఏఈ రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్ వైద్య సిబ్బంది అక్కయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీల్లోని మహిళలకు దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మలేరియా సూపర్‌వైజర్ సత్యానంద్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులను శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

వారాహి దేవి వైభవంపై ప్రవచనం


ప్రవచిస్తున్న రమ్యానంద భారతి

సీతంపేట: లలితా పరమేశ్వరి ఐదు పుష్ప బాణాల నుంచి ఉద్భవించిన శక్తి వారాహి దేవి అని శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం వారాహి దేవి వైభవంపై ఆమె ప్రవచించారు. లలితా దేవి సైన్యానికి వారాహి దేవి సర్వసైన్యాధ్యక్షురాలని, ఆమెకు ప్రత్యేక రథం ఉందని తెలిపారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన లహరిలో పలువురు భక్తులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

పౌర గ్రంథాలయంలో కెరీర్ వింగ్ ప్రారంభం


కెరీర్ వింగ్‌ను ప్రారంభిస్తున్న భాస్కర్‌రామ్

సీతంపేట: రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కర్ రామ్, రోటరీ విశాఖ పోర్టు సభ్యులు శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భాస్కర్ రామ్ బాలికల కెరీర్ వింగ్‌ను ప్రారంభించారు. ఈ విభాగానికి రోటరీ విశాఖ పోర్టు సిటీ వారు ఫర్నిచర్, టర్న్ స్టైల్ సమకూర్చారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సభ్యుడు ఎ.ప్రసన్న కుమార్ గ్రంథాలయ చరిత్రను, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యు.శర్మ, సభ్యులు విశ్వనాథ్, గ్రంథాలయ అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

'గైస్'లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రారంభించారు. ఈ కాలేజీలో రూ.10 కోట్లతో నూతన భవన సముదాయం నిర్మాణం జరుగుతోంది. కొత్తగా ఏబీ బ్లాకులతోపాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇక్కడ ప్రత్యేకంగా 11 కేవీ హెచ్‌టీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా భూగర్భ కేబుల్ లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖాతాదారుల చెంతకు యూనియన్ బ్యాంక్


రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న సుదర్శన్ భట్

మురళీనగర్: ఖాతాదారుల చెంతకు సకాలంలో సేవలు అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు పని చేస్తోందని ఆ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ సుదర్శన్ భట్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో రుణ గ్రహీతలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంఎస్‌ఎంఈ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ముంగిటకు బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన డిజిటల్ ప్రొడక్ట్స్‌ను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకుకు వచ్చే పని లేకుండా వ్యామ్ (vyom app) యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే నెఫ్ట్, ఆర్టీజీఎస్, నూతన అకౌంట్ ప్రారంభించడం, నగదు బదిలీ వంటి సేవలు పొందవచ్చని వివరించారు. ఖాతా ఏ బ్రాంచ్‌లో ఉన్నప్పటికీ ఖాతాదారుల నివాస ప్రాంతం సమీపంలోని యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి గోల్డ్ లోన్ తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్‌ఎంఈ రుణాలకు సంబంధించి సుమారు రూ.40 కోట్లు విలువైన మంజూరు పత్రాలను రుణ గ్రహీతలకు ఆయన అందించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జనరల్ మేనేజర్ సీవీఎన్ భాస్కరరావు, డిప్యూటీ జోనల్ హెడ్ సంతోష్ ప్రభు, రీజనల్ హెడ్ కె.దుండీశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ నరేష్, రమేష్, మేనేజర్లు, సిబ్బంది, 200 మంది వినియోగదారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎనిమిది మంది బాధిత కుటుంబాలకు రూ.14,30,000 అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహృదయంతో ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 2,396 వ్యాధులను చేర్చారన్నారు. ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులు ఉంటే వారి హాస్పిటల్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అమెరికన్ ఇంగ్లిష్ భవిష్యత్ దోహదకారి



మాట్లాడుతున్న రచయిత జీవన్‌కుమార్

సీతంపేట: మాతృ భాషతోపాటు ఆంగ్ల పరిభాష అవసరం ఎంతో ఉందని, అమెరికన్ ఇంగ్లిష్ భవిష్యత్ దోహదకారని లెక్సిగ్రాఫర్ వీఎస్టీ తెలుగు–ఇంగ్లిష్ డిక్షనరీ రచయిత ననపల జీవన్‌కుమార్ అన్నారు. తన్మయి క్రియేటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై రెండు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికన్ ఇంగ్లిష్ శైలి, గురి, వినియోగం, ఆంగ్లం–అమెరికన్ ఇంగ్లిష్‌కు సంబంధించి కొన్ని పదాలు పలికి సంభాషించడం, వాక్య నిర్మాణాలు సోదాహరణంగా వివరించారు. సనాతన ధర్మం, మొండి ఘటం, పెళ్లిచూపులు, కొబ్బరి బొండాం వంటి రోజువారి పదాలను ఆంగ్ల వెర్షన్, కోమాలిమ్ వంటి ఆంగ్ల పదాల రీతులను ప్రస్తావించారు. కార్యక్రమంలో తన్మయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి సిహెచ్.వి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు, కొణతాల రాజు, బాందంగీర్ సాయి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉద్యోగాలిస్తామన్న నకిలీ సంస్థను నమ్మవద్దు'

సీతమ్మధార: ఇటీవల హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ పేరిట ఓ నకిలీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ, విద్యా శాఖ అనుమతి ఉందని నమ్మబలికి ఉద్యోగాలు ఇస్తామని యువతను ఆకర్షించడానికి పలు ప్రకటనలు ఇస్తూ లక్షల రూపాయలు దండుకుంటోందని, ఆ సంస్థను ఎవరూ నమ్మవద్దని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్, రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ విషయాన్ని స్కూల్స్ కమిషనర్, రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఎస్.రమేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారన్నారు. రాష్ట్రంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సంస్థకు మాత్రమే గుర్తింపు ఉందని, ఇంకెవరికీ అనుమతి లేదని, ఉద్యోగాల పేరిట మోసపోవద్దని వివరణ ఇచ్చినట్లు ప్రకాశ్‌రావు వెల్లడించారు.

అలరించిన సంగీత విభావరి


సినీ పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తెలుగు హిందీ సినీ సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకుడు పి.బి.ఖాన్ నిర్వహణలో గాయనీ గాయకులు హుషారైన సినిమా పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, మహమ్మద్ ఖాన్, రాజేంద్రప్రసాద్, చెక్కా రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు పమ్మరాజు నరసింహమూర్తి, సాంబశివరావు, మెలోడి సత్యనారాయణ, పి.బి.ఖాన్, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, శైలజ, మాధురి, శ్రీదేవి కొత్త తరానికి చెందిన తెలుగు, హిందీ సినీ గీతాలను ఆలపించి ఆహుతులను కట్టిపడేశారు.

రైల్వే స్టేషన్‌లో స్వల్ప మంటలు

- సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెద్ద ప్రమాదం


స్విచ్ బోర్డు వద్ద చెలరేగిన మంట


విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించింది. ఒకటో నంబర్ ప్లాట్ ఫారం చివర్లో జీఆర్పీ పక్కన గల చల్లని తాగునీరు సరఫరా చేసే ఫ్రిజ్‌కు సరఫరా చేసే విద్యుత్ స్విచ్ బోర్డు నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన శానిటేషన్ సిబ్బంది, రైల్వే ప్రయాణికులు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని వెంటనే విద్యుత్ కనెక్షన్‌లను తప్పించారు. లేకుంటే ఇది కాస్తా షార్ట్ సర్క్యూట్ అయి పెను ప్రమాదమే జరిగేది. సిబ్బంది అప్రమత్తమై వ్యవహరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.